క్లుప్తంగా

ఇద్దరు అధ్యాపకులకు ఉత్తమ అవార్డులు



డాక్టర్ కేశవులుకు అవార్డు అందజేస్తున్న యూనివర్శిటీ ప్రొఫెసర్లు

బేస్తవారిపేట: రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అధ్యాపకులుగా డాక్టర్ పి.కేశవులు, డాక్టర్ ఆర్.బాలవెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. శనివారం విజయవాడలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో ఏపీ ఎడ్యుకేషన్ ప్రొఫ్రెస్ అసోషియేషన్ ఆధ్వర్యంలో బెస్ట్ టీచర్స్ అవార్డులు పంపిణీ చేశారు. బేస్తవారిపేట ప్రవీణ్ బీఈడీ కళాశాలల ప్రిన్సిపాళ్లుగా కేశవులు, బాల వెంకటేశ్వర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి.దేవేందర్‌రెడ్డి, ఆంధ్రకేసరి యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు, నాగార్జున యూనివర్శిటీ డీన్ ప్రొఫెసర్ స్వరూప చేతులమీదుగా అవార్డు అందజేశారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్



జూదరులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

కంభం: కంభం శివారులోని పంట పొలాల్లో పేకాట ఆడుతున్న ఐదుగురిని ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ.14,130 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై బి.నరసింహారావు తెలిపారు.

632 మందికి ఉచిత వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ బ్రహ్మానందరెడ్డి, సౌమ్య

గిద్దలూరు రూరల్: పట్టణంలోని విశ్వభారతి స్కూల్ ఆవరణలో డాక్టర్ బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో ఒంగోలుకు కిమ్స్ ఆస్పత్రి వైద్యులు ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 632 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. 58 మందికి కంటి ఆపరేషన్లు, ఇద్దరికి ఈఎన్‌టీ, నలుగురికి జనరల్ సర్జరీ, ఇద్దరికి ఆర్థో ఆపరేషన్లు అవసరమని వైద్యులు సిఫార్సు చేశారు. కార్యక్రమంలో నేత్ర వైద్యురాలు సౌమ్య, గుండె వైద్య నిపుణుడు బి.కిరణ్‌కుమార్‌రెడ్డి, గైనకాలజిస్ట్ గాయత్రి, మోకాళ్లు, కీళ్ల వైద్య నిపుణులు కార్తికేయరెడ్డి, లివర్ వైద్య నిపుణుడు వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ జాతర



బోనాలతో బయలుదేరిన మహిళలు

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని ఈగలపాడులో గ్రామ దేవత పోలేరమ్మ జాతర ఆదివారం అంగరంగ వైభవంగా సాగింది. నెల పొంగళ్లు, పోలేరమ్మ తల్లి జాతర మహోత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు బోనాలతో బయలుదేరి పోలేరమ్మ తల్లిని దర్శించుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. అనంతరం గ్రామ శివారులోనే వేటలు కోసం ఉత్సాహంగా విందు భోజనం చేశారు.

రేపు రేగడపల్లిలో పోలేరమ్మ పొంగళ్లు



ముస్తాబైన పోలేరమ్మతల్లి ఆలయం

కొనకనమిట్ల: మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీపోలేరమ్మతల్లి, పోతురాజుస్వామి నూతన ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు ముగిసి 40 రోజులైన సందర్భంగా మంగళ, బుధవారాల్లో పోలేరమ్మ తల్లికి పొంగళ్లు పెడుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మంగళవారం అమ్మవారికి కుంకుమ బండ్లు, నైవేద్యాలు, బుధవారం ఉత్సవం, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వివరించారు.

వృద్ధురాలికి నిత్యావసరాలు అందజేత

కొమరోలు: మండలంలోని అల్లినగరం గ్రామంలో పేదరికంలో కొట్టుమిట్టాడుతున్న ఓ వృద్ధురాలికి రక్ష వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు రంగ జనార్దన్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

లంబోదరా పాహిమాం



మార్కాపురం : నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు



మార్కాపురం : కోలాటం ఆడుతున్న మహిళ భక్తులు



రాచర్ల : కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్సై కోటేశ్వరరావు



మార్కాపురం తూర్పువీధిలో పూజలు చేస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, గుంటక సుబ్బారెడ్డి తదితరులు



గంగంపల్లెలో నిమజ్జనానికి తరలిస్తున్న భారీ వినాయక విగ్రహం

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణం, పరిసర గ్రామాల్లో గణేష్ నవరాత్రులు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. విఘ్నేశ్వర సేవా సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో 45 ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలతోపాటు పలువురు భక్తులు మరో 50 ప్రాంతాల్లో వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. ఆదివారం 9వ రోజు కావడంతో పట్టణంలోని తూర్పువీధి, జవహర్‌నగర్ కాలనీ, మార్కెట్ సెంటర్, పీఎస్ కాలనీ, పేరంబజారు, మెయిన్‌బజారు, తేరుబజారు తదితర ప్రాంతాల్లో విఘ్నేశ్వరునికి పూజల అనంతరం అన్న సంతర్పణ చేశారు. తూర్పువీధిలో నిర్వహించిన కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుంటక సుబ్బారెడ్డి, వెంకటరెడ్డితో పాటు పలువురు యూత్ సభ్యులు పాల్గొన్నారు. కాగా పలు చోట్ల ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను కోలాహలంగా నిమజ్జనానికి తరలించారు.

రాచర్ల: మండలంలోని గంగంపల్లె, రాచర్ల బీసీ కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయ విగ్రహాల ఊరేగింపు వైభవంగా సాగింది. రాచర్ల బీసీ కాలనీలో చిన్నారుల కోలాట ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది.గంగంపల్లె, రాచర్ల బీసీ కాలనీల్లో గణేశ్ నిమజ్జన కార్యక్రమాలను ఎస్సై.పి.కోటేశ్వరరావు పర్యవేక్షించారు. స్వామి వారి ఊరేగింపును భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు. గొడవ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలులోని బీసీ కాలనీలో 9 రోజులుగా పూజలందుకున్న గణనాథుడిని భక్తుల కోలాహలం మధ్య నిమజ్జనానికి తరలించారు. తొలుత పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



కొమరోలు : గణనాథుడిని ఊరేగిస్తున్న భక్తులు



రాచర్ల బీసీ కాలనీలో కోలాటం ప్రదర్శిస్తున్న చిన్నారులు

ఆదర్శనీయుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య



జార్జి కళాశాలలో విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేస్తున్న రాజబాబు



విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ షంషీర్ అలీబేగ్

- మార్కాపురంలో ఘనంగా ఇంజినీర్స్ డే వేడుకలు


మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని పలు ఇంజినీరింగ్ కళాశాల్లో ఆదివారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి, ఇంజినీర్స్ డేను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ శ్యామ్యూల్ జార్జి, కిట్స్, ఏ1 గ్లోబల్, వీహెచ్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజినీరింగ్‌లో దేశానికే ఆదర్శంగా నిలిచారని జార్జి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజబాబు కొనియాడారు. గొప్ప ఇంజినీర్లు కావాలంటే విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. మాజీ మంత్రి, కళాశాల టెక్నికల్ అడ్వైజర్ డాక్టర్ ఆదిమూలపు సురేష్, కళాశాల కార్యదర్శి ఆదిమూలపు విశాల్ విద్యార్థులకు ఇంజినీర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. అకడమిక్ డీన్ మస్తానయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కిట్స్ కళాశాలలో కళాశాల కరస్పాండెంట్ అన్నా కృష్ణచైతన్య ఆధ్వర్యంలో ఘనంగా ఇంజినీర్స్ డే నిర్వహించారు. కృష్ణచైతన్య మాట్లాడుతూ శ్వేశ్వరయ్య గొప్ప ఇంజినీర్‌గా ప్రపంచ ప్రఖ్యాతి గాంచారని, ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కృష్ణారెడ్డి, కోఆర్డినేటర్ పీవీ అనిల్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ రంగనాయకులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశ పురోభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర ఎంతో కీలకమని వీహెచ్‌ఆర్ విద్యా సంస్థల చైర్మన్ వెన్నా హనుమారెడ్డి పేర్కొన్నారు. ఇందిరా ఇంజినీరింగ్ కళాశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెన్నా ఇందిర, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కందుల రాజశేఖరరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏ1 గ్లోబల్ కళాశాలలో చైర్మన్, ఏపీ మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్ అలీబేగ్ మాట్లాడుతూ.. దేశానికి ఇంజినీర్లు వెన్నెముక లాంటివారన్నారు. ఇంజినీరింగ్ విద్య ప్రాముఖ్యతను వివరించారు. విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ముందుగా విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

అల్లుకుపోయిన నిర్లక్ష్యం!



రాచర్లలో చెట్టులా దర్శనమిస్తున్న విద్యుత్ స్తంభం



పలుగుంటిపల్లెలో వ్యవసాయ పొలాల్లో..

రాచర్ల: రాచర్ల మండలంలోని జేపీ చెరువు, రాచర్ల, పలుగుంటిపల్లె, అనుములపల్లె, అనుమలవీడు గ్రామాల్లో వ్యవసాయ పొలాల్లోని విద్యుత్ స్తంభాలకు చెట్ల తీగలు అల్లుకోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. అనుములపల్లె సబ్‌స్టేషన్ నుంచి రాచర్ల వరకు వేసిన 24 గంటల విద్యుత్ లైన్‌కు సంబంధించిన స్తంభాలకు చెట్ల తీగలు అల్లుకునిపోయాయి. చెట్ల తీగల కారణంగా షార్ట్‌సర్క్యూట్ అయి ఫ్యూజ్‌లు తరచూ కాలిపోతుండటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పాడుతోంది. ఫ్యూజ్‌లు కాలిపోతే మళ్లీ వేసేందుకు విద్యుత్ సిబ్బంది మామూళ్లు వసూలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ సరఫరా సక్రమంగా జరిగేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



అనుమలవీడులో ప్రమాదకరంగా సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్



గొట్లగట్టులో గుంపులుగా ఉన్న శునకాలు

రాజ్యమేలుతున్న గ్రామ సింహాలు

- బాటసారులు, వాహనదారులపై వీధి కుక్కల మెరుపుదాడి
- తరచూ కుక్క కాటుకు గురవుతున్న చిన్నారులు



వీధిలో సంచరిస్తున్న కుక్కలు

కొనకనమిట్ల: మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కలు రాజ్యమేలుతున్నాయి. ఎక్కడ చూసినా వీధి కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ దాడికి యత్నిస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కుక్కలు గ్రూపులుగా విడిపోయి పరస్పరం దాడి చేసుకోవడంతోపాటు వీధుల్లో తిరుగుతున్న ప్రజలను వెంటపడి కరుస్తూ దడ పుట్టిస్తున్నాయి. చిన్నారులు తరచూ కుక్క కాటుకు గురవుతున్నారు. వీధుల్లో స్వైర విహారం చేసే శునకల్లో ఏది మంచి కుక్క, ఏది పిచ్చి కుక్కో అర్థం కాక కుక్క కాటుకు గురైన వారు ఆందోళన చెందుతున్నారు. రోడ్ల మీదకు రావాలంటేనే జంకుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లోనే ఎక్కువగా శునకాలు సంచరిస్తూ పాఠశాలకు వెళ్లే పిల్లలు, చిన్నారులు, వృద్ధులను గాయపరుస్తున్నాయి. పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు వణికిపోతున్నారు. శునకాల బెడదను తప్పించేందుకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో యువకులే కర్రలు తీసుకుని వీధుల వెంట తిరుగుతూ బెదరగొడుతున్నారు. గొట్లగట్టు గ్రామంలో గడిచిన నెల రోజులుగా వీధి కుక్కలు బీభత్సం సృష్టిస్తున్నాయని, ప్రజలకు నిద్ర లేకుండా చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. కుక్కల బారి నుంచి రక్షణ కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కోటసత్యమాంబదేవి



భక్తులకు దర్శనమిస్తున్న అల్లూరి పోలేరమ్మతల్లి



రేగడపల్లిలో ప్రత్యేక అలంకరణలో శ్రీవారు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించారు.

అల్లూరి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ తల్లికి భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేసి అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని పుట్ట, నాగ శిలలకు భక్తులు పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ ఈవో, ఆలయ చైర్మన్, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీవారికి శ్రవణా నక్షత్ర పూజలు

కొనకనమిట్ల: మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్రం సందర్భంగా ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు విజయకాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండస్వామి ఆలయంలో శ్రీవారి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ వేదపండితులు తిరుమాలాచార్యులు విశేష పూజలు చేశారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

కంభం: రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శనివారం రాత్రి జరిగింది. మార్కాపురం రైల్వే ఏఎస్సై వెంకట్రావు తెలిపిన వివరాల మేరకు..సుమారు 35–40 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి మృతదేహం కంభం చెరువుకట్ట సమీపంలో కంభం– జేబీకేపురం రైల్వేస్టేషన్ మధ్యలో పట్టాలపై పడి ఉంది. మృతదేహం ముక్కలై చెల్లాచెదురుగా పడి ఉంది. మృతుడి ఆచూకీ తెలియలేదని, ఎవరైనా తెలిస్తే 7780171069 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

కంభం: కంభం లయన్స్ క్లబ్ 40 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందుతోందని లయన్స్‌క్లబ్ గుంటూరు వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చందోలు హరిప్రసాదరావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వాసవీ విద్యానికేతన్‌లో 2024–25 సంవత్సరానికి ఎంపికైన నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడిగా డాక్టర్ బైసాని రామకృష్ణ, కార్యదర్శిగా పేర్నిగుండయ్య, కోశాధికారిగా వెంకట్రావు, ఉపాధ్యక్షుడిగా తన్నీరు బాలరంగయ్య, సర్వీస్ ప్రోగ్రామ్ చైర్మన్‌గా సయ్యద్ జాకీర్ హుస్సేన్, ఎల్‌సీఐఎఫ్ కో ఆర్డినేటర్‌గా మహబూబ్ బేగ్ తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు.

ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలి

రాచర్ల: ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తలకు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్సై పి.కోటేశ్వరరావు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఆదివారం సాయంత్రం ధ్రువీకరణ పత్రాలు, లైసెన్స్ లేని వాహనదారులకు జరిమానా విధించారు. ఆయన వెంట ఏఎస్సై ఆదిశేషయ్య ఉన్నారు.

గిద్దలూరులో చోరీ



దొంగతనం జరిగిన తీరును పరిశీలిస్తున్న క్లూస్ టీమ్

గిద్దలూరు రూరల్: పట్టణంలోని విశ్వభారతి స్కూల్ సమీపంలోని ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. వివరాల్లోకి వెళితే.. విశ్వభారతి స్కూల్ సమీపంలో సిద్ధారెడ్డి హరిప్రియ అనే మహిళ భర్త చనిపోవడంతో పిల్లలు హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఈ క్రమంలో హరిప్రియ ఇంటికి తాళాలు లేక బంధువుల ఇంటికి వెళ్లిన సమయంలో దుండగులు ఇంట్లోకి ప్రవేశించి బీరువా పగులగొట్టి అందులోని కమ్మలు, ఉంగరం, వెండి ఆభరణాలతో పాటురూ.25 వేల నగదు మొత్తం రూ.2 లక్షల విలువైన సామాన్లు అపహరించారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం ఉదయం క్లూస్ టీం వచ్చి దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలించారు.